నిత్యావసర సరుకుల పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న మహ్మద్ నజీబ్

గోల్కొండ: నిరుపేదలకు తాము అండగా ఉంటూ వారిని ఆదుకుంటున్నామని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ పీస్ అంబాసెడర్ మహ్మద్ నజీబ్ అన్నారు. బుధవారం ఆయన టోలిచౌకి అక్బర్‌బాగ్‌లోని తన కార్యాలయంలో నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కమిటీ ప్రతినిధులు నిరుపేదలను గుర్తించి వారికి నిత్యావసరాలు అందేలా చూస్తున్నారన్నారు. ఆయన వెంట మొహమ్మద్ ఇస్మల్, ఫరాహ్ తదితరులు ఉన్నారు.

ఎల్పీజీ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి


వేణుగోపాల్‌రావు

జియాగూడ: సెట్విన్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ప్రవేశపెట్టిన ఎల్పీజీ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ ఎండీ వేణుగోపాల్‌రావు సూచించారు. పురానీహవేలీలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పనకు ఎల్పీజీ కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఎల్పీజీ మెకానిక్ మూడు నెలల కాల పరిమితి, ఎల్పీజీ డెలివరీ బాయ్ రెండు నెలల కాల పరిమితిలో శిక్షణ ఇవ్వనున్నమని ఆయన తెలిపారు. తెలంగాణ డిస్ట్రిబ్యూషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ కోర్సులను నగరంలోని చార్మినార్ మోతీగల్లీ, సీతాఫల్‌మండిలోని సెట్విన్ శిక్షణ కేంద్రాల్లో నిర్వహించనున్నామన్నారు. మరిన్ని వివరాలకు 90101 57312, 81424 39336లో సంప్రదించవచ్చు.

27న శ్రీశైలంలో వార్షిక కార్యవర్గ సమావేశం


నాగ్‌నాథ్ మాశెట్టి

చార్మినార్: శ్రీశైలంలోని తమ సత్రంలో భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని..ఇందులో భాగంగా ఈ నెల 27న వార్షిక కార్యవర్గ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని శ్రీశైలం శరణ బసవేశ్వర సదాశివయ్య వీర శైవ అన్న సత్రం సభ్యులు, టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ నాగ్‌నాథ్ మాశెట్టి తెలిపారు. సత్రం అధ్యక్షుడు నేతి జగదీష్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి బి.రమేష్‌తో పాటు కార్యవర్గం, సభ్యులు పాల్గొంటారన్నారు. శ్రీశైలంలోని అన్న సత్రం హాల్‌లో జరిగే ఈ సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

నవశక్తి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'అలయ్ బలయ్'



గౌలిపురా: ఉప్పుగూడ ధన్‌రాజ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రాత్రి నవశక్తి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.జ్ఞానేశ్వర్ గౌడ్, కార్యదర్శి జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవశక్తి వాకర్స్ అసోసియేషన్ క్యాషియర్ వి.పుల్లయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.అంజయ్య, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ సెక్రటరీ కె.గోపాల్‌తో పాటు రాజేందర్ యాదవ్, లక్ష్మణ్ గౌడ్ పాల్గొన్నారు.

ఆలయాలు, మసీదుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి


మాట్లాడుతున్న ఏసీపీ

విజయనగర్‌కాలనీ: ఆలయాలు, మసీదుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆసిఫ్‌నగర్ పోలీస్ డివిజన్ ఏసీపీ విజయ్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మందిర్, మసీద్ కమిటీ ప్రతినిధులతో ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..ఇటీవల పలు ఆలయాల వద్ద జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా మందిర్, మసీదుల కమిటీ సభ్యులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమైన ఆలయాలు, మసీదుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని నిరంతర నిఘా ఉండేలా చూడాలన్నారు. బస్తీలు, కాలనీలలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా మైత్రి పీస్ కమిటీ సభ్యులు తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు, మైత్రి కమిటీ అధ్యక్షుడు యాసీన్ అలీ, ప్రధాన కార్యదర్శి అశ్వాక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై కేవీ కేశవులు విగ్రహాన్ని పెట్టాలి



అబిడ్స్: మాజీ మంత్రి, స్వాతంత్ర సమరయోధుడు కేవీ కేశవులు విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై పెట్టాలని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ జనరల్ సెక్రెటరి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేవీ కేశవులు స్వాతంత్రం కోసం చేసిన పోరాటాలు అమోఘమన్నారు. భట్టి విక్రమార్కను కలిసిన వారిలో ఆదిమూలం శంకర్, పోల్కం వినయ్‌రాజ్, వెన్ను శివకుమార్, పల్లాల నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు



అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున్న బీజేపీ సభ్యత్వం నిర్వహిస్తున్నామని రాష్ట్ర బీజేపీ దళిత మోర్చ ఉపాధ్యక్షుడు భీశ్వ ఓంప్రకాష్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై బీజేపీపై ఆదరణ చూపుతున్నారన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు భీశ్వ ఓంప్రకాష్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సభ్యత్వం నిర్వహించారు. అనంతరం భీశ్వఓంప్రకాష్ మాట్లాడుతూ..బీజేపీతోనే ప్రజలకు అన్ని విధాల అభివృద్ధి కొనసాగుతుందన్నారు. నియోజకవర్గంలో బీజేపీ నెంబర్:1 స్థానంలో ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటు చేసి కాంగ్రెస్‌ను గద్దె దింపేందుకు కృషి చేస్తామన్నారు.

ట్రాఫిక్ దిగ్బంధంలో మూసాబౌలి చౌరస్తా

అందుబాటులో లేని ట్రాఫిక్ సిగ్నల్స్

- నగరానికి..పాతబస్తీకి ప్రధాన రోడ్డులో నిత్యం రద్దీ
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు


మూసాబౌలి చౌరస్తాలో ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

చార్మినార్: పాతబస్తీకి ప్రధాన రోడ్డుగా కొనసాగుతున్న మూసాబౌలీ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యలు అధికంగా ఉన్నాయి. ఇది చార్మినార్ ఔటర్ రింగ్ రోడ్డులో కీలకమైన రహదారి. నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి పాతబస్తీకి రావడానికి..పాతబస్తీలోని ఇతర ప్రాంతాల నుంచి నగరానికి వెళ్లడానికి మూసాబౌలి చౌరస్తా ప్రధాన రోడ్డుగా ఉంది. ఖిల్వత్, లాడ్ బజార్, బండికాఅడ్డా, చెలాపురా, కసరట్టా తదితర ప్రాంతాలతో పాటు పురానాపూల్, దూద్‌బౌలి, ఖబూతర్‌ఖానా తదితర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు మూసాబౌలి చౌరస్తా ద్వారా వెళ్లాలి. ఈ చౌరస్తా నిత్యం వాహనాల రద్దీతో కిటకిటలాడుతుంది. కీలకమైన ఈ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ అందుబాటులో లేకపోవడమే కాకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి ట్రాఫిక్ పోలీసులు సైతం విధి నిర్వహణలో కనిపించరు. దీంతో ఇక్కడ నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఏ వాహనం ఎటు వైపు నుంచి ఎటు వైపు దూసుకెళతుందో తెలియని దుర్భర పరిస్థితులున్నాయి.

గంటల తరబడి..

గంటల తరబడి మూసాబౌలి చౌరస్తాలో ట్రాఫిక్ నిలిచిపోతుంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి ట్రాఫిక్ పోలీసులు అందుబాటులో లేకపోవడంతో సమస్య తీవ్రమవుతుంది. అత్యవసర పరిస్థితుల్లో నిర్దేశిత సమయానికి చేరుకోవాల్సిన వాహనదారులు ఇక్కడి ట్రాఫిక్ పద్మ వ్యూహంలో చిక్కుకుంటున్నారు. మూసాబౌలి చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యను తగ్గించడానికి సాధ్యమైనంత వెంటనే ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ పోలీసులు విధి నిర్వహణలో ఉండాలని వాహనదారులు కోరుతున్నారు. ఆశించిన స్థాయిలో ట్రాఫిక్ సిగ్నల్స్ అందుబాటులో లేని కారణంగా పాత బస్తీ ప్రధాన కూడళ్లల్లో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. గంటల తరబడి ఎక్కడి వాహనాలు అక్కడే ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయి.

వెంటనే ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి..

ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోతే వాహనదారుల దూకుడుకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి ట్రాఫిక్ పోలీసులను విధి నిర్వహణలో ఉంచితే ట్రాఫిక్ సమస్యలు కాస్తైనా తగ్గుముఖం పడుతాయి. పాతబస్తీలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య జఠిలమవుతుంది. మూసాబౌలీ చౌరస్తాలో వెంటనే ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి వాహనదారులకు కలుగుతున్న అసౌకర్యాలను దూరం చేయాలి.

– తిరుపతి శ్రీనివాస్‌రావు, వ్యాపారి, మూసాబౌలి

కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ..

క్షేత్ర స్థాయి పరిశీలన చేయాల్సిన ఉన్నతాధికారులు తమ కార్యాలయాలకు మాత్రమే పరిమితం కావడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. తమ స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయాలను సకాలంలో తీసుకోకపోవడంతో పరిస్థితులు జఠిలమవుతున్నాయి. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ట్రాఫిక్ సమస్యను తగ్గించడానికి ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నామని సంబంధిత ట్రాఫిక్ ఉన్నతాధికారులు పదే పదే చెబుతున్నప్పటికీ..ఆచరణ సాధ్యం కావడం లేదు.

– టి.ఉమామహేంద్ర, బీజేపీ నాయకుడు, పురానాపూల్

కౌంటర్ దాఖలు చేయండి

ఆర్‌టీవీ రవిప్రకాశ్‌కు సిటీ సివిల్ కోర్టు సూచన

సిటీ కోర్టులు: ఆర్‌టీవీ న్యూస్ నెట్‌వర్క్ ప్రెసిడెంట్, ఎడిటర్ రవిప్రకాశ్‌పై రూ.100 కోట్ల పరువు దావా సిటీ సివిల్‌కోర్టులో యూరోఎగ్జిమ్ బ్యాంకు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణ బుధవారం 9వ అదనపు చీఫ్ జడ్జి కోర్టులో జరిగింది. ఈ కేసులో రవిప్రకాశ్ కౌంటర్ దాఖలు చేయాల్సి ఉండగా చేయలేదు. తదుపరి విచారణలోపు కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశిస్తూ విచారణను నెల 24కు వాయిదా వేసింది. రవి ప్రకాశ్ జూలై 14 న ప్రసారం చేసిన వీడియోలో తమ బ్యాంకును దొంగ ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూట్ అని, ఫేక్ బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చిందంటూ ఆరోపణలు చేసినట్లు యూరో ఎగ్జిమ్ బ్యాంకు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. అంతర్జాతీయంగా పేరు తమ బ్యాంకుకు తీవ్ర నష్టం వాటిల్లేవిధంగా ఎలాంటి ధృవీకరణ, నిజ నిర్ధారణ లేకుండా వీడియోలు ప్రచురించి తమ పరువుకు భంగం కలిగేలా వ్యాఖ్యాలు చేసినట్లు పేర్కొన్నారు. తమ పరువుకు భంగం కలిగేలా, తమ బ్యాంకును దొంగబ్యాంకుగా చిత్రీకరించినందుకు రూ.100 కోట్లకు దావా దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. అయితే ఈ వందకోట్ల దావాకు కోర్టు ఫీజు కింద రూ.1,00,05,852 చెల్లించారు. 1958 నుంచి హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు చరిత్రలోనే దీన్ని అత్యధిక ఫీజుగా పేర్కొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన


సభ్యత్వ నమోదులో దేవర శ్రీనివాస్

గోల్కొండ: బీజేపీ సభ్యత్వ నమోదుకు అన్నివర్గాల నుంచి విశేష స్పందన లభిస్తుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన గుడిమల్కాపూర్‌లోని పీ. ఇంద్రారెడ్డి పూలమార్కెట్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతే..మార్కెట్‌కు వచ్చే పూల వ్యాపారులతో పాటు, కొనుగోలుదారులు స్వచ్ఛందంగా వచ్చి బీజేపీలో సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు. ప్రధాని మోదీ చేపడుతున్న విధానాలు సమర్థ పాలనను చూసి ప్రజలు బీజేపీలో చేరుతున్నారని ఆయన పేర్కొన్నారు. మరో వైపు తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసిగి వివిధ పార్టీల వారు బీజేపీలో చేరుతున్నారన్నారు. ఆయన వెంట విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

బాలుడి అదృశ్యం



గౌలిపురా: బాలుడు అదృశ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..మొఘల్‌పురా ఉర్దూఘర్ ప్రాంతానికి చెందిన ఖదీర్ షరీఫ్ కుమారుడు ఆయాన్ షరీఫ్ (13) విద్యార్థి. ఈ నెల 12న రాత్రి 8.30 గంటలకు ఆయాన్ షరీఫ్ ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి కనిపించకుండా పోయాడు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన కుమారుడు కనిపించడం లేదని ఖదీర్ షరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా స్లమ్ సెల్ కన్వీనర్‌గా సుభాష్‌కుమార్

నాంపల్లి: బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర స్లమ్ సెల్ కన్వీనర్‌గా బండారి సుభాష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సుభాష్ కుమార్ మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతం, ఆదర్శాలకు అంకితమై నీతి, నిజాయితీగా, నిబద్ధత, క్రమశిక్షణ, చిత్తశుద్ధితో వ్యవహరిస్తానని తెలిపారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి రాష్ట్ర స్లమ్ సెల్ కన్వీనర్‌గా నియమించిన ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


నియామక పత్రాన్ని అందుకుంటున్న సుభాష్‌కుమార్

అత్యాధునిక ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కృషి



లంగర్‌హౌస్: ఔత్సాహిక క్రీడాకారుల కోసం కార్వాన్‌లో అత్యాధునిక సౌకర్యాలతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన సబ్జిమండిలోని గంగపుత్ర సంఘం వీర్ అభిమన్యు వ్యాయామశాలలో 68వ తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్ ఫెడరేషన్ రెజిలింగ్ పోటీలను ప్రారంభించారు. అండర్-19 పోటీలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నానన్నారు. మొదటగా ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానల్లో విద్యార్థుల కోసం వారు ఇష్టపడేలా గ్రౌండ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. గోల్కొండ రిసాలాబజార్‌లోని ఒవైసీ ప్లే గ్రౌండ్‌లో ఫుట్‌బాల్ కోర్టును ఇటీవలే ప్రారంభించామన్నారు. అదేవిధంగా గంగపుత్ర సంఘం వారు అత్యాధునిక వ్యాయామశాలను కూడా తయారుచేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ అధికారులు, కోచ్‌లు, వీరభిమన్యు వ్యాయామశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహేష్ వైష్ణవికి సన్మానం



గన్‌ఫౌండ్రీ: కామన్వెల్త్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన మహేష్ వైష్ణవిని మాజీ మంత్రి కేటీఆర్ ఘనంగా సత్కరించారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ ఆమెను సత్కరించి అభినందించారు. పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన వైష్ణవి మునుముందు మరింత రాణించాలని పేర్కొన్నారు. ఆశీష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..బీఆర్ఎస్ హయాంలోనే క్రీడాకారులకు పదేళ్లపాటు సంక్షేమం, అభివృద్ధి కొనసాగిందన్నారు.

'సమ్మేళనాలు ప్రేమాభిమానాలను పెంచుతాయి'



మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్


చార్మినార్: సమ్మేళనాలు ఒకరినొకరు కలిసి మెలిసి ఉండడంతో పాటు అందరిలో ప్రేమాభిమానాలను పెంచుతాయని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. పాత నగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీరాములు అధ్యక్షతన దసరా సమ్మేళనం జరిగింది. హనుమాన్‌నగర్‌లోని ఎస్కేవి బంకెట్ హాల్‌లో జరిగిన ఈ దసరా సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై.. వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న వారికి ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇలాంటి సమ్మేళనాలు ప్రతి ఏటా జరగాలన్నారు. రోజు వారి జీవన ప్రయాణంలో తీరిక లేకుండా పని చేస్తున్న వారందరికీ ఇలాంటి కార్యక్రమాలు ఉపశమనం కలిగిస్తాయన్నారు. మున్నూరు కాపుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అదుముళ్ల శైలజ హామీ ఇచ్చారు. మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్టీ దదువై రాఘవేందర్ మాట్లాడుతూ.. మున్నూరు కాపుల అభివృద్ధికి ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో పుప్పాల రవీందర్, మ్యాడం చంద్రకుమారి, ఆకుల పాండు రత్నం, ఆనంద్, సూర్యప్రకాష్, ప్రదీప్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రమణీయం..

చెంచులక్ష్మీ నర్సింహ కల్యాణం


ఆకట్టుకున్న నృత్య రూపకం

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య శిక్షణాలయం కళాకృతి నృత్యాలయ సంస్థ 11వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నృత్య గురువు భారతి ఆధ్వర్యంలో చెంచులక్ష్మీ నర్సింహ కల్యాణ సాంస్కృతిక పౌరాణిక వారసత్వ శాస్త్రీయ నృత్య రూపకం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ..భారతదేశ పౌరాణిక సాంస్కృతిక శాశ్వత వారసత్వానికి ఈ నృత్య రూపకం నిదర్శనంగా నిలుస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కూచిపూడి కేరళ నృత్యగురువు అనుపమా మోహన్, డీజీ.రాజబాబు, డీఆర్‌డీఓ సౌత్ హెడ్ నీల యాదయ్య, విశ్రాంత శాస్త్రవేత్త కె.రాంబాబు, డ్యాన్స్ ఇండియా సంపాదకులు విక్రమ్‌కుమార్, సంస్థ వ్యవస్థాపకులు భారతి తదితరులు పాల్గొన్నారు.



ధూల్‌పేట్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలి


మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌తో సమావేశమైన ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలోని ధూల్‌పేట్, మంగళ్‌హాట్, ఆగాపురా, పురానాపూల్ ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ విద్యాధర్‌తో ఆయన సమావేశమయ్యారు. ఆనంద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ..వర్షాల కారణంగా ధూల్‌పేట్‌లోని పలు పరిసర ప్రాంతాలు, గోషామహల్‌లోని పలు ప్రాంతాల రోడ్లు గుంతలమయంగా మారాయన్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు. డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ..తన దృష్టికి ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే పరిష్కరిస్తామన్నారు. దివ్యంగ్ సింగ్ జమేధర్, శైలేందర్ సింగ్, చంద్రప్రకాష్ సింగ్, సురేందర్‌సింగ్, కిరణ్ సింగ్ పాల్గొన్నారు.

హిందూ శ్మశాన వాటికల్లో చెత్తను తొలగించాలి


జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాడి మహేందర్

చార్మినార్: రానున్న దీపావళి వేడుకలను పురస్కరించుకుని పాతబస్తీలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న హిందూ శ్మశాన వాటికల్లో చెత్తాచెదారాన్ని తొలగింపచేయాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాడి మహేందర్ కోరారు. ఆయన బీజేపీ నాయకులు నిరంజన్ యాదవ్, మహేష్, విజయ్‌కుమార్, శ్రీనివాస్, సుభోద్ తదితరులుతో కలిసి జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీపావళి వేడుకల సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని ప్రజలు తమ పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్లి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందని..ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా సైదాబాద్ ఎర్రకుంట, చాంద్రాయణగుట్ట హిందూ శ్మశాన వాటిక, లలితాబాగ్, ఇందిరానగర్, నల్లవాగు తదితర శ్మశాన వాటికలలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేయించాలని జెడ్సీని కోరినట్లు ఆయన తెలిపారు.

అత్యున్నత విద్యాభ్యాసానికి చిరునామాగా సిటీ కాలేజీ


మాట్లాడుతున్న ఆచార్య లింబాద్రి

చార్మినార్: అత్యున్నత విద్యాభ్యాసానికి చిరునామాగా ప్రభుత్వ సిటీ కాలేజీ నిలిచిందని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య ఆర్.లింబాద్రి కొనియాడారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి డిగ్రీ కోర్సులలో ఏ కొత్త కోర్సు రూపొందించినా అది ముందుగా సిటీ కాలేజీలోనే ప్రవేశపెట్టామని, కొత్త కోర్సులకు, గుణాత్మక విద్యా విధానాలకు సిటీ కాలేజీ ప్రయోగశాలగా కొనసాగుతుందన్నారు. బుధవారం ప్రభుత్వ సిటీ కాలేజీలో 2018-23 విద్యా సంవత్సరాలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు జరిగిన 3వ స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ సబ్జెక్టులలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులతో పాటు దాదాపు 400 మంది విద్యార్థులు ఈ స్నాతకోత్సవంలో పాల్గొని ధ్రువపత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా లింబాద్రి మాట్లాడుతూ..ఈ ఐదేళ్లలో విద్యాభ్యాసం చేసి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా, ఉద్యోగులుగా, వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలభాస్కర్, కళాశాల విద్యా శాఖ సంయుక్త సంచాలకులు ఆచర్య జి.యాదగిరి, ఆచార్య రాజేందర్ సింగ్, ఆచార్య రాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు శబరిమలకు మణికంఠ మహా పాదయాత్ర ప్రారంభం

గౌలిపురా: గౌలిపురా శ్రీరాంనగర్ కాలనీలోని అయ్యప్ప స్వామి ఆలయం నుంచి మణికంఠ మహా పాదయాత్రను ఈ నెల 17న ప్రారంభించనున్నట్లు మణికంఠ మహా పాదయాత్ర భక్త బృందం సభ్యులు తెలిపారు. అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం శబరిమలకు మహా పాదయాత్రను ప్రారంభమవుతుందని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

చట్ పూజలకు అన్ని ఏర్పాట్లు చేయాలి



జియాగూడ: 20వ వార్షికోత్సవ చట్ పూజలను ఘనంగా నిర్వహించుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌ను కోరినట్లు పూజా సమితి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. బుధవారం ఎమ్మెల్యేను బీఆర్ఎస్ కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌కుమార్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..నవంబర్ 7, 8వ తేదీల్లో బాపూఘాట్ తపోవన్ పార్క్‌లో నిర్వహించే పూజలకు సుమారు 2 వేలకు పైగా భక్తులు హాజరవుతారని తెలిపారు. ఇందుకు జీహెచ్ఎంసీ, విద్యుత్, వాటర్‌వర్క్స్, పోలీస్ విభాగాల ద్వారా ఏర్పాట్లు చేయాలని వెల్లడించారు.